# సందెల వీరయ్య మృతి బాధాకరం..

## కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్



**ఎల్కతుర్తి, /జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన సందెల వీరయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామస్థుల సహకారంతో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సందెల వీరయ్య గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉంటూ మంచి మనసున్న వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. గ్రామ ప్రజలకు చేదోడువాదోడుగా నిలిచిన ఆయన మృతి గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, భవిష్యత్తులో కూడా గ్రామం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వీరయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కదారి రాజారాం, సాతూరి ఐలయ్య, దాసరపు రాజమౌళి, నల్లగొండ శివప్రసాద్, బొంకూరి అనిల్, గొర్రె శ్రీనివాస్, కదారి రవీందర్, కోరే రవి తదితరులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు.

# కొత్తపేట గ్రంధాలయ భవనాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ అధికారులు..

-భవన మరమ్మతులు,అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు చేస్తాం..

-యువత,విద్యార్థులకు లైబ్రరీ ఉపయోగకరంగా మారే విధంగా కృషి చేస్తాం.

-సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్..



**బయ్యారం/,జూన్ 12.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంధాలయ భవనాన్ని అభివృద్ధి చేసి, గ్రామ యువతకు మరియు విద్యార్థులకు ఉపయోగపడేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు వెంటనే స్పందించిన వెన్నం శ్రీకాంత్ రెడ్డి సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులను పంపగా వారు శుక్రవారం గ్రంధాలయ భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. భవన మరమ్మతులు,అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన,పాఠకులకు అనుకూల వాతావరణం ఏర్పాటుకు చేపట్టాల్సిన పనులను పరిశీలించి, త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని యువత, విద్యార్థులకు గ్రంధాలయం ఎంతో ఉపయోగకరంగా మారే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు శ్రీనివాస్, తుంగతుర్తి మోహన్ రావు,పంచాయతీ సెక్రటరీ జక్కి రఘువీర్,గట్టు చేతన్ సాయి గౌడ్,తోటపల్లి ప్రవీణ్,షేక్ పాషా,గుడ్డురి సాయి తదితరులు పాల్గొన్నారు.



# సర్ ..ఓ భూతం లాంటిది

## చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం,జూన్ 12 (జర్నలిస్ట్ జర్నీన్యూస్)**



ఎస్ఐఆర్ సర్ ఆనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్టాల్లో్ర అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీ విజేతలకు సత్కారం

## అన్ని గ్రామాల వివోఏలకు చీరల పంపిణీ





**భీమదేవరపల్లి/జూన్12 (జర్నలిస్ట్ వార్త):**
భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల శుక్రవారం బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల వివోఏలకు చీరలను పంపిణీ చేశారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు వివిధ రంగాల్లో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎండి షబానా, కార్యదర్శి ఎం. రజిత, కోశాధికారి ఎం. హైమావతి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు బొక్కల స్రవంతి, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ముస్తఫాపూర్ సర్పంచ్ సుజాత, ఏపీఎం వేణు, సీసీలు, కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో పునీత అంతోని మహోత్సవాలు

పురవీధుల్లో ఘనంగా యాత్ర.. నేడు ధర్మసాగర్‌కు వరంగల్ నూతన బిషప్ విజయ పాల్ రెడ్డి

ప్రత్యేక పవిత్ర బలిపూజకు సర్వం సిద్ధం..



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లోని సెయింట్ అంతోని రోమన్ క్యాథలిక్ చర్చిలో జరుగుతున్న పునీత అంతోని మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పునీత అంతోని వారి యాత్ర భక్తి పారవశ్యాన్ని తలపించగా, శనివారం జరిగే ప్రధాన ఉత్సవాలకు చర్చి యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వరంగల్ ప్రాంత నూతన బిషప్‌గా నియమితులైన విజయ పాల్ రెడ్డి ప్రత్యేక పవిత్ర బలిపూజ నిర్వహించనున్న నేపథ్యంలో భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. శుక్రవారం సాయంత్రం చర్చి ఫాదర్ జోజి బాబు ఆధ్వర్యంలో పునీత అంతోని వారి ప్రతిమతో నిర్వహించిన యాత్ర ధర్మసాగర్ పురవీధుల గుండా ఘనంగా సాగింది. ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలు, ఆరాధనల మధ్య సాగిన ఈ ఊరేగింపులో మహిళలు, యువకులు, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాత్ర సాగిన మార్గమంతా ప్రార్థనలు చేస్తూ భక్తులు తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ జోజి బాబు మాట్లాడుతూ పునీత అంతోని జీవితం విశ్వాసం, త్యాగం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రేమ, శాంతి, సోదరభావం క్రైస్తవ ధర్మానికి మూల సూత్రాలని, మానవ సేవ ద్వారానే దేవుని చేరుకోవచ్చని ఆయన అన్నారు. పునీతుల బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ప్రత్యేక పవిత్ర బలిపూజ శనివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. ఈ వేడుకలకు వరంగల్ నూతన బిషప్ విజయ పాల్ రెడ్డి హాజరై పవిత్ర బలిపూజ నిర్వహించనున్నారు. ఆయన తొలిసారిగా ధర్మసాగర్ చర్చిని సందర్శించనున్న నేపథ్యంలో విశ్వాసుల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తోంది.
శనివారం జరిగే కార్యక్రమాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవ భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఫాదర్ జోజి బాబు వెల్లడించారు. పవిత్ర బలిపూజ అనంతరం ప్రత్యేక ఆశీర్వాదాలు, ఆధ్యాత్మిక సందేశాలు, ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చర్చి కమిటీ



సభ్యులు, క్రైస్తవ సంఘ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. పునీత అంతోని వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుతూ చర్చి నిర్వాహకులు క్రైస్తవ కుటుంబాలతో పాటు ప్రజలందరికీ ఆహ్వానం పలికారు. ధర్మసాగర్‌లో జరుగుతున్న ఈ మహోత్సవాలు జిల్లాలోని క్రైస్తవ సమాజానికి ఆధ్యాత్మిక ఉత్సవంగా నిలుస్తున్నాయి.

# ధర్మసాగర్‌లో డ్రైనేజీలకు ఆక్రమణల గండం..!

## ఎస్సీ కాలనీలో వర్షపు నీటి ముప్పు అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంగా ఉన్న ధర్మసాగర్ గ్రామపంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో గత ఐదేళ్లుగా డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకపోవడంతో వర్షాకాలం సమీపిస్తున్న వేళ స్థానికుల్లో ఆందోళన నెలకొంది. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాల సమయంలో డ్రైనేజీలు మురుగుతో నిండిపోవడం, నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.

**డ్రైనేజీలపై షెడ్లు.. బోర్డులతో ఇరుకైన రహదారులు**

గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలపై రేకుల షెడ్లు నిర్మించడం, వాణిజ్య సముదాయాల బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల మురుగునీటి పారుదల వ్యవస్థ దెబ్బతింటోందని ప్రజలు చెబుతున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీలు పూర్తిగా ఆక్రమణలకు గురై నీటి ప్రవాహం నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు డ్రైనేజీలపై నిర్మించిన షెడ్లు, రోడ్డుపైకి విస్తరించిన బోర్డుల కారణంగా ప్రధాన




రహదారులు ఇరుకుగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
ధర్మసాగర్ మండల కేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు, వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. అయినప్పటికీ ప్రజా సౌకర్యాలకు విఘాతం కలిగిస్తున్న ఆక్రమణలను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారులు స్పందించేది ఎప్పుడో..?**

డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల కోసం నిర్మించిన మురుగు కాలువలు కొందరి స్వార్థ ప్రయోజనాలకు బలవుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
వర్షాలు కురిసేలోపు డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచి, వాటిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే గతంలో మాదిరిగానే వర్షపు నీరు ఇళ్లలోకి చేరి భారీ నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వర్షాలు కురిసే ముందు చర్యలు తీసుకుంటారా..? లేక ఇళ్లు మునిగిన తర్వాత మేల్కొంటారా..?" అని ధర్మసాగర్ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు డ్రైనేజీ ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

**నోటీసులు జారీ చేసి తొలగిస్తాం : పంచాయతీ కార్యదర్శి**

ఈ విషయమై ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ వివరణ కోరగా, డ్రైనేజీలపై అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లు, వాణిజ్య సముదాయాల బోర్డులను గుర్తించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.



